కథా నిలయం
5155
శ్రీకాకుళం

# మట్టి-బంగారం

గంప కింది కోడిపుంజు 'కొక్కొరొకో' అనరిచింది.

అలవాటు ప్రకారం శ్రీలక్ష్మమ్మకి మెలుకువొచ్చేసింది. చీకట్లింకా పూర్తిగా విచ్చుకోలేదు.

రాత్రి కడిగి ముగ్గు పెట్టిన కొత్త గచ్చు నేల చల్లదనం వెన్నులోకి నేరుగా చొచ్చుకుపోతోంది. నిద్రలో తెలీలేదు కానీ మాఘమాసపు తెల్లవారుఝాము చలి పళ్ళు టకటకలాడేలా వణికించింది.

శ్రీలక్ష్మమ్మ దిగ్గున లేచి కూర్చుని పైట చెంగును భుజం చుట్టూ తిప్పి చేతుల మీదుగా కప్పుకుంది.

"ఈ ముతక నేత సీరలు సలికి బాగా పనికొస్తయ్" అనుకుంది స్వగతంలాగ.

అలవాటు ప్రకారం వాకిలి తుడిచి, కళ్ళాపు జల్లాలనే ధ్యాసలో బైటికి నడిచింది. ఇంటిచుట్టూ కరెంటు దీపాలు దేదీప్యమానంగా వెలుగుతున్నాయి.

వాకిట్లో నిలబడి తమ్ముడు కట్టిన కొత్తింటిని ఆనందంగా చూసుకుంది శ్రీలక్ష్మమ్మ. తెల్లని సున్నంగోడల్తో మెరిసిపోతున్న డాబా ఇంటికి తన దిష్టే తగులుతుందేమోననిపించింది. పైన కట్టిన దిష్టి గుమ్మడికాయకి, పళ్ళికిలిస్తున్న దిష్టిబొమ్మకి మెటికలు విరిచింది.

బైట పోర్టికోలో తప్పెటగుళ్ళవాళ్ళోపక్క, ఎంకన్నబాబు పాటగాళ్ళొకపక్కా ముణగదీసుకుని పడుకునివున్నారు. చలినుంచి కాపాడుకునే ప్రయత్నంలో పైమీది పంచెల్ని చెవుల చుట్టూ తిప్పి పాగాల్లాగా కట్టుకున్నారు.

తమ గొల్లకులంలో ఎవరింట ఏ సంబరం జరిగినా వీళ్ళుండవలిసిందే, రాత్రి రెండు గంటల్దాకా సిమ్మాద్రి అప్పన్న పాట పాడీ, తప్పెటగుళ్ళతో గెంతి గెంతి అలిసిపోయిన తప్పెటగుళ్ళోళ్ళు కట్టుకున్న ఎర్రపంచెలూ, తోకబెల్టులూ విప్పకుండానే నేలమీద పడి ఒళ్ళెరగకుండా నిద్రపోతున్నారు. ముందు రోజు

రాత్రి ఆరు గంటల్నుంచి తెల్లారి ఆరు గంటల్దాకా ఎంకన్నబాబు పాట పాడిన అనపర్తి అప్పారావు బృందం మనుషులు నిన్న పగటేళంతా జోగుతూనేవున్నారు.

ఈ రాత్రి తప్పెటగుళ్ళ సంబరం చూసి పడుకున్నారేమో వాళ్ళూ ఒళ్ళెరక్కుండా నిద్రపోతున్నారు.

ఎంకన్నబాబు పాటలో దుర్గమ్మతల్లి ఏషం కట్టే మొల్లిముత్యాలు సూడసక్కని కుర్రోడు. కళగలమొహం, కండపుష్టికలిగిన ఆజానుబాహు రూపం. నిద్రలో ఏం గుర్తుకొచ్చిందో పక్కనున్న చెయ్యి తీసి గుండెలమీద వేసుకుని నవ్వుకుంటున్నాడు. బలమైన పెదవి చివర పన్నుమీది పన్ను తళుక్కున మెరిసింది. తప్పెటగుళ్ళవాళ్ళల్లో ఎవరో నిద్రలోకదిలి కాలు తీసి పక్కనున్నవాడిమీదవేసాడు. అతని కాలికున్న మువ్వలపట్టెడ ఘల్లుమంది.

శ్రీలక్ష్మ్మ ఉలిక్కిపడి అక్కణ్ణుంచి కదిలింది. వీధిగుమ్మం పైనకట్టిన దుర్గమ్మతల్లి ఫోటోకి చేతులుజోడించి చెంపలు వేసుకుంది. కొత్తింట్లో దిగిన మూ్రోజులపాటూ దీపాలార్పకూడదు, తలుపులుముయ్యకూడదు. గదులన్నిటిలోనూ లైట్లు వెలుగుతున్నాయి. తను పడుకున్న ముందుగది దాటి లోపలికినడిచింది శ్రీలక్ష్మ్మ. హాల్లో చెల్లెళ్ళు ముగ్గురూ, మరుదులూ, వాళ్ళ పిల్లలూ నిద్రపోతున్నారు.

నైరుతిమూల పడకగదిలో ఇంటి యజమాని, శ్రీలక్ష్మ్మ తమ్ముడు అయోద్దిరాముడు, భార్య రత్నం, కొడుకు చిన్నికృష్ణుడు, కూతురు నీల నిద్ర చేస్తున్నారు.

వంటింటి పక్కనించి వెనక వరండాలోకి నడిచింది శ్రీలక్ష్మ్మ. అక్కడి కుక్కి మంచంలో వెల్లకిలా పడుకుని కళ్ళు తెరిచి పైకి చూస్తున్న ఎనభై ఏళ్ళ ముసలమ్మ దగ్గరకెళ్ళి మంచం పక్కన నిలబడి అనుమానంగా చూసింది. "ఈ జీవుడు గాల్లోకెగిరిపోయేడనుకుంటన్నా వేటే లచ్చమ్మా" అంది ముసలమ్మ చూపుతిప్పకుండానే గరగరమనే గొంతుతో.

"ఓసినీ- ముసల్దానా, బలేగా అడలగొట్టేవే" అంది శ్రీలక్ష్మమ్మ.

"సూత్తా వుండు, నీతమ్ముడు మనవల్నెత్తీదాకా బతికుంటానో లేదో"

"ఉండుండు, నీకేం పోయింది, నీ యెనకాల సేసీవోళ్ళం మా పనై పోద్దిగానీ"

"అంటే ఈ ముసిల్ది ఎప్పుడు పోతాదా అని సూత్తన్నారన్నమాటే గందా"

"ఊరుకోయే నానమ్మా, అయ్యా అమ్మా ఎలాగుంటారో తెల్నోడిని పెంచి పెద్దోడిని చేసి ఇంతటోడినిసేసేవు. ఆడికి నువ్వంటే ప్రేణవే. నిన్ను నెత్తిమీదెట్టుకుంటాడు." ముసలమ్మ ముడతల మొహంలో ఓక్షణం ఆనందం వీచికలా పొడగట్టింది. అంతలోనే గొంతుకలోకి ఏడుపుతెచ్చుకుని- "ఆ... ఏవెట్టుకుంటాడో,నామాటేవన్నా ఇంటన్నాడా" అంది.

శ్రీలక్ష్మమ్మకు తెలుసు, ఇల్లు కట్టొద్దని ముసలమ్మపోరు, ' ఒక గొల్లోడు ఇంతిల్లు కట్టేడని కళ్ళల్లో నిప్పులోసుకుంటార్రా అందరూ' అంటాది.' పోనీ కడితే పెంకుటిల్లు కట్టు, మెట్లేసి మేడ కట్టకురా నాయనా కనుదిట్టి కొడతాది, నరుడి సూపుని నల్ల రాయైనా పగిలి పోతాది.' అంటూ ఒకటే గొడవ. అయోద్దిరాముడు మేడకడతానన్నకాణ్ణుంచీ ముసలమ్మది అదే పోరు.

అయోద్దిరాముడికి ఏళాకోళం- "ఏటేమామ్మా, ఇదేవన్నా మీ కాలం అనుకుంటన్నావేటి? లోకం శాలా మారిపోయింది తెల్సా. నువ్వాకుక్కి మంచంలోంచి కదల్లేవు, లేపోతేనా, ఊరంతా ఎంత మారిపోయిందో తిప్పిసూపించేద్దును" అంటాడు.

పెళ్లైన ఏడాదికే తలచెడి తమ్ముడింటికి చేరడంతో శ్రీలక్ష్మమ్మకి ఆ ఇంట జరిగేవన్నీ తెలుసు. గునపంలా తిని తిరుగుతున్నముసలమ్మనడుంజారిపోయి మంచమెక్కిన వైనం కూడా తెలుసు.

శ్రీలక్ష్మమ్మకి బాల్యం గుర్తుకొచ్చింది-

చుట్టు గుడిసె పక్కనే మేకలపాక, పదో పన్నెండో మేకలు, అంతే.

ఇంట్లో పేదరికం తాండవిస్తూ ఉండేది. మామ్మ, అమ్మ కూలికెళ్ళేవోళ్ళు.

తండ్రి మేకల్ని మేపడానికి తోలుకెళ్లి వచ్చేటప్పుడు ఎవరి చేలోంచో ఒక మొక్కజొన్న పొత్తో, నాలుగు గంటి ఎన్నులో ఇరుసుకొచ్చి కాల్చితే ఎగబడి తినేవోళ్ళు పిల్లలందరూ. తన తర్వాత ఇద్దరు చెల్లెళ్ళు. ఆ తర్వాత పుట్టేడు రాముడు.

ముగ్గురాడపిల్లల్తర్వాత అబ్బాయి పుట్టకూడదని అందరూ అన్నారు. రోజూ రామ పట్టాభిషేకం పటాన్ని పూజించే మూలమ్మ మామ్మ ‘ అయోద్ధి రాముడని పేరు పెట్టండహె, ఏ కీడూ అంటదు’ అని మనవడికాపేరే పెట్టింది.

తర్వాతి కాన్పులో పార్వతి పుట్టింది. కానుపైన వెంటనే మాయ బైటికి రాకపోతే ఎరకల మంత్రసాని ఆకుపసరు తాగించింది. అది వికటించి తల్లి ప్రాణం పోయింది. మరో ఆర్నెల్లకి మేకల వెంటెళ్ళిన తండ్రి కాలుజారి ఏలేట్లో కొట్టుకుపోయేడు. ఆనాటినుంచీ నాన్నమ్మే తల్లీతండ్రీ అయ్యింది తమకి.

మేకల మందని జీవనాధారంగా నమ్ముకుని తరిగిపోకుండా వృద్ధి చేసింది ముసలమ్మ.

“ఇయ్యి మేకలు కావే, మనకి కూడుపెట్టి పోసణ చేసే మాలచ్చమ్మలు” అనేది.

పదేళ్ళ కిందటి మాట, అయోద్ధిరాముడికి ఇరవై ఏళ్ళుంటాయి. అప్పటికే రాముడికన్నా పై ముగ్గురాడపిల్లల పెళ్ళిళ్ళు జరిపించేసింది ముసలమ్మ.

పదో క్లాసు ఫెయిలై పోగానే పెంకుల మిల్లులో గుమస్తాగా చేరేడు అయోద్ధిరాముడు. నాలుగేళ్ళుగా అదేపనికి తలొంచుకుని వెళ్ళొస్తున్నవాడు ఆరోజు గుడిసెలో కుక్కిమంచంలో పడుకుని ఎంత లేపినా లేవలేదు, తిండి తిన్లేదు. బతిమాలి, బామాలి, ఏడ్చి మొత్తుకుని విసిగి పోయి “ ఏటంటావురా అయితే” అంది మూలమ్మ.

రాముడు సివాల్న మంచంలో లేచి కూచుని-

“నేను బిజినెస్సు చేత్తాను” అన్నాడు.

“ఏం బిజినీసీ?”

“పెంకుల మిల్లులో వాటా వుంటాను.”

మూలమ్మకి ఆపుకోలేని నవ్వొచ్చింది. వాడి పక్కనే మంచంలో కూలబడి పడీపడీ నవ్వింది. నవ్వి నవ్వి కళ్ళల్లో నిండుకున్న నీళ్ళు పైట చెంగుతో తుడుచుకుని– “ఓరిబాబా, ఉట్టికెగరలేనమ్మ సొరగానికెగురుతాననందంట, అలాగుంది నీ యవ్వారం. ఆ సావుకారి బాబులికీ, ఆ కాపు మారాజులకీ పెద్దలు గడించి పోసిన ఆస్తులుంటాయి. ఎన్నాళ్లు కూకుని తిన్నా తరగవు. ఆళ్ళు పెంకుల మిల్లులైనా పెడతారు, ఆకాసానికి నిచ్చిన్లు కట్టమన్నా కట్టేత్తారు. ఆలతో మనకి సాటేటి?” అని నయాన్న చెప్పి చూసింది.

“ఇంకా అంటావా, ఎలాగా ఆ గుత్తాగారి మిల్లులో గుమాత్తాగా ఉంటన్నావా, ఆరిచ్చీ నూటేబై కాకుండా పెంకుముక్కలమ్ముకుంటే నెలకు వందో యాబయ్యో పైకస్పీ ఎలాగా దొరుకుతుంది కదా. అంతకి మించిన ఆశిలొద్దొరే మనకి. పారవతి పదో కళాసైపోతే దానికీ పెళ్లి సేసేద్దారి. ఆపైన నీకు. నీ కడుపుని నాలుక్కాయలు కాసి, నువ్వు సల్లగుంటే సూడాలనుందొరే నాకు”

“సూడకెక్కడికి పోతావే, నామాటిను. ఈ మేకలమ్మేద్దారి. వందపైన మేకలంటే మాటలు కాదు, ఆ డబ్బు సూపిస్తే బేంకు మిగతా డబ్బు అప్పిస్తాది. ఇంకా ఏవైనా తక్కువైతే మా గుప్తగారు సర్దుతామన్నారు. ఏడాది తిరక్కుండా నీ వొళ్ళంతా బంగారం చేసేత్తాను సూడు” మూలమ్మకికోపంనషాళానికంటింది. “ఓరబ్బీ, నిన్నగాక మొన్న పుట్టినోడివి, నీకు తెల్దుగానీ ఎవడైనా పేణం ఉన్న జీవాలమ్ముకుని పేణం లేని మిల్లు కొనుక్కుంటాడంట్రా? ఈ పెంకుల మిల్లులెప్పుడొచ్చినయ్‌రా, ఎందుకొచ్చినయ్? నేను కాపరానికొచ్చినప్పుడికి ఈ ప్రేంతం ఎంత సల్లని నేల తల్లి– ఊరికి కూతేటు దూరంలో ఏలేరు కాలవ. కొండలమీద కురిసిన వోనలకి ఊరిసుట్టూ వున్న నాలుగు సెరువులూ నిండిపోయీవి. ఊరి మద్దిలో మంచినీల్ల సెరువు ఎప్పుడైనా నీటికరువెరుగునా? దూడా దుక్కీ మేకా గొర్రీ మేపుకోవాలంటే పక్కనే పిలిత్తే పలికే అడివిమాలచ్మి. ఉప్పుళ్ళాగా మాకాలంలో ఎప్పుడైనా ఓ కుంకుడుకాయ, సింతకాయ కొనుక్కునెరుగుదువా? బళ్ళమీదతోలుకొచ్చి ఒద్దంటేఒంపేసిపోయీవోరు మావిడికాయలూ, తాటికాయలూని. ఆ తోటలూ సేలూ ఇయ్యాళ ఎక్కడన్నా కనపడతన్నాయా? అన్నిటినీ నరికేసి, బూవులన్నీ బీడెట్టేసి ఓ.. పేక్టరీలు పేక్టరీలు

తెగకట్టేత్తన్నారు. సుట్టుపక్కల నేలంతా తవ్వి తవ్వి ఆ మట్టిని కాల్చి పెంకులుజేసి అమ్ముకుంటన్నారు. మట్టిని ఉసురెట్టే కూడు మంచిది కాదొరే" అని భయపెట్ట బోయింది.

అయోద్ధిరాముడు పకపకా నవ్వేడు. " నీ బుర్రటెంకలో ఎన్ని బుద్దులున్నాయే ముసిలీ ముసిలీ'' అన్నాడు నాన్నమ్మ తలని అరిచేతిలో ఇరికించుకుని ఊపుతూ. "లాబాలు లేకుండా ఇన్ని మిల్లులెందుకు కడతారు చెప్పు- ఇప్పుడు ఊళ్ళో అరవై మిల్లులున్నాయి, నీలాగ ఆలోసిస్తే ఆళ్ళందరూ పేక్టరీలు నడిపినట్టే, లాబాలు తీసినట్టే. నువ్వే అన్నావు సూడు జీవాలకి పసిరి లేదని, మరేం? మన మేకల్నే చూడు. పది మైళ్ళ అవతలున్న అడివికి మేతకంపించాల్స్నొస్తంది. మందలు కడదారంటే పంట చేలే లేవాయిరి." అంటూ అక్కణ్ణించి లేచిపోయాడు.

నాలుగు రోజుల్లోనే ముసలమ్మకి తెలీకుండా మందంతా అమ్మిపారేసేడు.

ఆ సాయంత్రం వాకిట్లో నులకమంచంలో కూర్చుని వేడివేడి అన్నంలో చేపల పులుసు కలుపుకొని ఆవురావురుమని తింటున్న మూలమ్మకి ఆ కబురు తెలీగానే వెన్ను పూసనెవరో ఫెటీలున విరిచేసినట్లయింది. సగం తిన్న గిన్నెని శ్రీలక్ష్మమ్మ చేతికిచ్చేసి ఆ మంచంలో అలాగే చేరబడి పోయింది. ఆనాటికీనాటికీ వెన్ను తిరిగి రానేలేదు.

అయోద్ధిరాముడు ఆ తర్వాత ఎందరెందరో డాక్టర్లకి చూపించేడు. లాభం లేకపోయింది. అలా మూలుగుతూనే అన్నిట్లో కలిపించుకుంటుంది.

ఆ పూట ఇంట్లో వండే కూర దగ్గర్నుంచీ అన్నీ ముసలమ్మకే కావాలి. రత్నాన్ని పిలిచి "పిల్లా, ఈ పూట లచ్చించారు కాసి, వంకాయల్లో ఎండునెత్తళ్ళేసి వండే" అనో-

"రత్నవా, సెంబుడు మేకపాలు తెప్పించి బెల్లవేసి కాపీ కాయే" అనీ పురమాయిస్తూ ఉంటుంది.

రత్నానికి లోపల కొంత విసుగున్నా పైకి ప్రదర్శించదు. "పోన్లే ముసిల్ది, బతికినంతకాలం బతుకుద్దా" అనుకుని అడిగిందల్లా చేసిపెడుతుంది. అప్పుడప్పుడూ

“ఛీ, అదేం బూతవే మామ్మా, మేకపాల కాఫీ కంపుకొట్టదా” అంటుంది.

మేకపాలనీ,మేకల్నీ ఏమైనా అంటే మూలమ్మకి కోపం ముంచుకొస్తుంది.

“ఓలెల్లెల్లే టక్కులాడి మేకపాల బలం నీకేం దెల్సు? అమ్మగారింట గిద్దడు గేదిపాలు కొనుక్కుని తపేళానిండా టీనీళ్లెట్టుకుని ఇంటందరూ లొట్టలేసుకుని తాగటం అలవాటైపోయినోళ్ళు ఇదిగిలాగే నీకులాగే ఫేల్తారు. మేకపాలతో పరవాన్నం తిన్చూదు. మళ్ళొదులుతావేమో” అంటూ జగడానికి దిగుతుంది.

“ఉండవే మామ్మా, వాకిట్లో కళ్ళాపేసొత్తాను”అనిలేచింది శ్రీలక్ష్మమ్మ.

అలవాటు ప్రకారం నూతికాడికెళ్ళబోయి, చటుక్కున గుర్తొచ్చి బాల్చీ పట్టుకుని డాబామీదికెళ్ళింది. గదుల్లోకి ఇంకా నీళ్ళొదల్లేదు. మోటారువేసినప్పుడు నీళ్ళన్నీ డాబామీది ఓవర్ హెడ్ టేంకుకి ఎక్కుతున్నాయి. మోటారు పక్కనే ఒక టేప్ బిగించినా, మొదట్రోజే దానికేమైందో నీళ్ళు రావడం లేదు.

పైన నిలబడి చుట్టూ పరికించింది శ్రీలక్ష్మమ్మ.

తూరుపున మేకపాలు ఒలకబోసినట్టుంది.

చుట్టూ వున్న చుట్టుగుడిసెలన్నీ ఇప్పుడిప్పుడే మేలుకుంటున్నాయి.

తమ గుడిసె పక్కనున్న మరో మూడు గుడిసెల్ని కొని పడగొట్టించి తమ్ముడీ ఇల్లు కట్టించేడు.

అరవైడెబ్బై కులపోళ్ళ గుడిసెల్లో ఒకటో రెండో పెంకుటిళ్ళు. దూరంగా ఊళ్ళో ఉన్న సావుకార్ల మేడలు తప్పిస్తే ఊరికి దూరంగా కుంకాల చెరువు పక్కన ఇదొక్కటే మేడ, మందలో తలెత్తి నిలబడిన కొమ్ములగొర్రిపొటేలులాగ. శ్రీలక్ష్మమ్మకి గర్వంగా అనిపించింది.

తమ్ముడి తెలివితేటలు శ్రీలక్ష్మమ్మకెప్పుడూ అబ్బురంగా అన్పిస్తాయి.

ఫేక్టరీ కొన్నాక కులంలో పెద్దోళ్ళూ చిన్నోళ్ళూ తమ్ముడి ముందు చేతులు కట్టుకుని నిలబడుతున్నారు. నిన్నమట్టుకి నిన్న డబ్బున్న పెద్ద పెద్ద బూసాములు

తమ్ముడి భుజం మీద చెయ్యేసి కబుర్లాడతా, కార్లకాడికి నడుత్తా ఉంటే చుట్టాలందరూ ముక్కుమీద ఏలేసుకున్నారు.

ఆకరికి పెద్దగొల్లతాత అననే అనేసేడు- "మన అయోద్దిరావుడు మట్టిలో పుట్టిన మాణిక్కెంరా, ఆడు మట్టట్టుకుంటే బంగారవైపోద్ది" అని.

ఆ మాటిని ఎంత మంది ఈర్ష్యగా చూసేరో-

"ఏం పిల్లా, పొద్దున్నే మేడెక్కి ఏటి సూత్తన్నా?"

కిందికి చూసింది శ్రీలక్ష్మమ్మ. కపిలియ్య మావ తన దొడ్లో మేకల్ని ఇప్పుతున్నాడు.

"అ-నిన్నే సూత్తన్నాను. సిలకలు పీకిన తాట్టెంకలాగమొకంఎలిగిపోతందని."

"ఎక్కితే ఎక్కేవు గాని కళ్ళు నెత్తిమీదకి రానియ్యకొలే"

"నాకెందుకొత్తయ్ నెత్తి మీదకి, అల్లుడు మేడ కట్టేదని ఒత్తే నీకు రావాల, లేపోతే నీ కూతురికి రావాల" చుట్టుపక్కల ఇళ్ళల్లోంచి ఆడా మగా అందరూ పనుల కోసం బైట పడుతున్నారు. ఫేక్టరీలొచ్చేక పనికి లోటు లేకుండా పోయింది. పెద్దోళ్ళకి ముప్పై, పిల్లలకి పదిహేను కూలి. ఆడోళ్ళు మంచినీళ్ళ చెరువు నుంచి సావుకార్ల ఇళ్ళకి నీళ్ళు మోస్తారు. ఆళ్ళు పెట్టిన సల్దిపుల్ది తిని అట్నుంచటే ఫేక్టరీ పనుల్లోకెళ్తారు.

పిట్టగోడ మీద వాలి శ్రీలక్ష్మమ్మ తమ్ముడు ఇంటి చుట్టూ కట్టించిన ప్రహరీగోడ లోపలికి, బైటికి ఉన్న తేడాని గమనిస్తోంది. ఇళ్ళ ముందు పెంట కుప్పలు, ఇళ్ళ సందుల్లో రొచ్చు బురద, మేక పెంట, పశువుల పేడల ఘాటైన వాసన గాలిలో తేలి వచ్చి ముక్కు పుటాల్ని అదరగొడ్తోంది.

ఇంటి చుట్టూ కంకర గుండ పోయించి ఎత్తు చేయించడం వల్ల కొత్తింటి ప్రహరీలోపలంతా శుభ్రంగా గచ్చులా ఉంది. తెల్లగా తెల్లారి పోవడం చూసి శ్రీలక్ష్మమ్మ కంగారుగా డాబా దిగి బకెట్టు చీపురు పట్టుకుని ముందు వాకిట్లోకి నడిచింది.

పోర్టికోలో పడుకున్నోళ్లంతా లేచి ఆరు బైటికి పోయినట్టున్నారు. వాళ్ళ తాలూకు సంచులు, మూటలు ఓ మూలగా పోగెట్టి వున్నాయి.

శ్రీలక్ష్మమ్మ వంగి చీపురెయ్యబోతుండగా ఎప్పుడు లేచొచ్చేడో అయోద్ధి రాముదు "అక్కా" అన్నాడు వెనక నించి. మామూలుగా పిలిచేనని అతననుకున్నా ఆ కంఠంలో గద్దింపు వినబడింది శ్రీలక్ష్మమ్మకి.

"ఇయ్యేళ నించి నువ్వు బైటికొచ్చి వాకిళ్లయ్యీ తుడవొద్దు. ఆటన్నిటికీ నేను మనుషుల్నెట్టేను లోపలికి నడు" అన్నాడు.

శ్రీలక్ష్మమ్మకి ఆనందించాలో వద్దో తెలీలేదు.

చీపుర్ని గోడకి చేరబెట్టేసి, దోపిన కుచ్చిళ్ళు కిందికొదిలేసి, తలదించుకుని లోపలికెళ్లి పోయింది. ఆజానుబాహువులా ఎదిగిన తమ్ముడి ముందు తనెప్పుడూ చిన్నబోయినట్టే అన్పిస్తుంది.

మేదర జంగయ్యొకటి, అతని బామ్మర్ది ఈర్రాజు ఒకటి మేకపోతుల్ని బలిమిని లాక్కొచ్చి, వాకిట్లో గునపం దిగేసి దానికి కట్టేసారు. అవి కొత్త పరిసరాల్ని కాస్సేపు పరికించి చూసి అరుపులు లంకించుకున్నాయి.

ఇంతవరకూ ఊళ్ళో అద్దెకున్న ఇంట్లోంచి వేన్ మీద సామానొచ్చింది.

ఫేక్టరీలో పన్చేసే కుర్రాళ్ళు పది మంది వేన్‌లోంచి బిలబిలమంటూ దిగేరు.

"అయోద్ధి బాబూ, సామాన్లు సర్దేమంటారా"

"ఓరుండంర్రా, ఇల్లింకా తుడిసినట్టు లేదు. అసలు మీయమ్మగారు లేసిందో లేదో సూడండి ముందు. ఆ రాణీగార్ని లేపేసి, ఇల్లంతా తుడిసేసి, అప్పుడు సామాన్లు సర్దండి. ఆవిడిగారు ఏదెక్కడెట్టమంటాదో అడిగి మరీ ఎట్టంర్రోయ్, లేపోతే గొడవలైపోతాయి."

కుర్రోళ్ళు నవ్వుకుంటూ వెళ్ళిపోయేరు.

అయోద్ధిరాముదు గృహప్రవేశం సందర్భంగా నిన్న సత్యనారాయణ వ్రతం జరిగింది కాబట్టి కాయగూరల భోజనాలు. ఈ రోజు గ్రామదేవత రాయిలమ్మతల్లికి బలిచ్చిన వేటపోతుల మాంసంతో భోజనాలు.

నిన్న మిగిలిపోయిన పుల్హార, సాంబారు లాంటివి పేటలో ఇంటింటికీ పంపించేరు. ఇంకా మిగిలిపోతే చెరువుకవతలి వాడలకి కబురుచేసి పందారం పెట్టేసేరు.

"డప్పులుచ్చుకు రమ్మని బారికోళ్ళకి చెప్పేసిరా" అని ఓ కుర్రాణ్ణి పురమాయించి అయోద్దిరాముడు ఇంట్లోకి నడిచేడు.

"తొందరగా తెవలండి ఆడోళ్ళూ! మేకపోతులొచ్చేసేయి. ఇంక డప్పులోళ్ళు రావడం ఒక్కటే తరవాయి!" అంటూ ఇంటివెనక వంట వసారాల వైపు వెళ్ళేడు.

అక్కడ వంట వాళ్ళు పలావు సామాన్లు సిద్ధం చేసుకుంటున్నారు. వంట మేస్త్రి సుబ్బులు పెద్ద కళాయిలో గోధుమ రవ్వ ఉప్మా కలబెడుతున్నాడు.

ఉప్మా వాసన తగిలింది కాబోలు మూలమ్మ మామ్మ మంచంలోంచే గొంతు పెకలించి అరుస్తోంది- "ఉపాసాల్తోగందా తల్లి దగ్గిరికెల్లాలి. ఈలోపలప్పుడే ఉప్మాలొండేసు కుంటన్నారా, అది కూడా పారబోసుకుంటారా-"

"నువ్వూరుకోయే మామ్మా, రత్నవూ నేనూ ఉంటాంలే ఉపాసం. అందర్నీ మద్దినేల్దాకా ఉపాసవెట్టమంటావా, బాగుందే నీవరస" అని అయోద్దిరాముడు బ్రష్షు మీద పేస్టు వేసుకుంటూ-

"సుబ్బులూ పలావు అదిరిపోవాలొరె ఇయ్యాళ" అన్నాడు వంట మేస్త్రితో. అలాగే అదిరి పోను మరి, నువ్వేమో పులావులో చికిను ఎయ్యొద్దంటన్నావు. ఉత్తి బిరియానీ చేసి, చికిను యేరే, ఏట మాంసం ఏరే వండితే మాత్రం దానికి చికిని బిరియానీ రుసొస్తాదేటి" అన్నాడు సుబ్బులు.

"పులావులో చికినేస్తే ఎవరైనా తిననోళ్ళొత్తే ఇబ్బందైపోద్దిగదరా! అన్నట్టు బంగాళా దుంపల కుర్మా మర్చి పోవద్దొరె. మొత్తం పేక్టరీలోళ్ళందర్నీ బోజనాలకి పిలిసేసేను. వందకోళ్ళూ,రెండు పోతులూ సాలవట్రా? అన్నాడు.

"సాలాపోతే అప్పుడు సూసుకుందార్లే, నేనున్నాను గందా" అన్నాడు సుబ్బులు

"అదిగో అందుకే నిన్ను పిలిసింది మరి" అంటూ అయోద్దిరాముడు బాత్‌రూంలోకెళ్ళేడు.

అంతకు ముందే పైపులైను సాయిలొచ్చి కిందికి నీళ్ళొచ్చేలా వాల్వులన్నీ సరిచేసి వెళ్ళేడు.

ఆ ఇంటి ఆడపడుచులు పిల్లలకి అరుగులమీదా, వరండాల మీదా స్నానాలు చేయించేస్తున్నారు.

మేనమామ కొనిచ్చిన రంగురంగుల బట్టలేసుకుని ఆనందంగా గెంతుతున్నారు స్నానాలు కానిచ్చేసిన పిల్లలు.

రత్నం తన పిల్లలకి ప్రత్యేకంగా బాత్‌రూంలో స్నానం చేయించి ఈ మధ్య అయోద్దిరాముడు హైదరాబాదెళ్ళినప్పుడు కొనుక్కొచ్చిన ఫేషను బట్టలేసింది.

మూలమ్మ వాళ్ళని చూసి "ఓరియ్యేం బట్టల్రా పగిటేసగాళ్లలాగ" అంది. "మీ బాబు సూడు ఎంత సక్కటి గుడ్డలేసుకున్నాడో" అంది గంజి పెట్టి ఇస్త్రీ చేసిన తెల్లలాల్చీ షరాయి వేసుకుని అట్నుంచి వెళ్తున్న అయోద్దిరాముడికి దిష్టితగలకూడదని మెటికలు విరుచుకుంటూ.

"ఎలాగున్నావే అమ్మమ్మా" అంటూ వచ్చింది అయోద్దిరాముడి మేనత్త కూతురు మంగ.

"ఎవళు" అంది ముసలమ్మ కళ్ళకి చెయ్యడ్డం పెట్టుకుని.

"నేనేనే అమ్మమ్మా, మంగని" అంటూ మంచం పట్టి మీద కూర్చుని ముసలమ్మ మీద చెయ్యేసి నిమిరింది మంగ.

ఆ చేతినలాగే గట్టిగా పట్టుకుని "నా తల్లే నాయమ్మే, వచ్చేవంటే" అంది.

"నిన్న రాలేదేం? రొతం నిన్నేగదా. మొన్నొచ్చి ఈ రెండ్రోజులూ ఉండెల్తే ఎంత బాగుండేది! పోన్లే వొచ్చేవు. అంతే సాలు. ఆళ్ళేరి, పిల్లలూ మీయాయినా?"

"వొత్తన్నారెనకాల"

"అయ్యేళ మీబాబు ఎదురు మేనరికవని నిన్నియ్యనన్నాడు. సూసేవా, ఈ బోగం నీకు రాసిపెట్టిలేదుగందే" ఏడుపులోకి దిగింది మూలమ్మ. "ఊరుకోయే అమ్మమ్మా, ఎవళకేది ప్రేప్తవో అంతే గదా" అని వేదాంతం మాట్లాడింది మంగ.

"ఇప్పుడేనేటోయ్ రాడం, నిన్నరాలేదేం" అంటూ మంగ భుజం మీద చెయ్యేసి పలకరించింది పార్వతి. వాళ్ళిద్దరిదీ ఒకే వయసు.

వాళ్ల ఊరినుంచి మోసుకొచ్చిన అరటిగెల, పాలగుండిగ తెచ్చి దించేడు మంగ మొగుడు.

అటుగా వచ్చిన అయోద్ధిరాముడు "బాగున్నారా" అంటూ మంగమొగుణ్ణి పలకరించి మంగ పిల్లలిద్దర్ని భుజాలమీద చేతులేసి దగ్గరికి లాక్కున్నాడు.

నాగరీకం నేర్చి నల్లరూపున నిగనిగలాడ్తున్న అయోద్ధిరాముణ్ణి, రెక్కలుముక్కలు చేసుకుని పొలాలమ్మట పనిచేసి రాటుదేలి మోటుగా కన్పిస్తున్న తన భర్తనీ ఓ సారి మార్చి మార్చి చూసింది మంగ.

ఎదురుమేనరికం కాదు ఏం కాదు, అప్పట్లోఫేక్టరీలో పద్దులు రాసి పదోపరకో సంపాదించడం తప్ప ఒళ్ళొంచి ఏ పనీ పాటా చెయ్యలేనోడు పెళ్ళాంబిడ్డల్నేం పోషిస్తాడని తన అయ్య అమ్మ అయోద్ధిరాముణ్ణి వద్దనుకున్నారు.

వంగపండురంగు పట్టుచీర కట్టుకుని నగానట్రాతో తయారై వచ్చిన రత్నాన్ని ఈర్ష్యగా చూసింది మంగ. మంగ కళ్లల్లోని ఈర్ష్యను చూసి సంతృప్తిగా నవ్వుకున్నాడు అయోద్ధిరాముడు. గుంభనమైన ఆ నవ్వు శ్రీలక్ష్మమ్మ కళ్లల్లో పడనే పడింది.

శ్రీలక్ష్మమ్మకి తమ్ముడిలోని ఈ గుణం అంటేనే భయం. కాని, ఆ గుణం వల్లనే పట్టుపట్టి ఏదైనా సాధించడానికి తెగించేస్తాడని నమ్మకమూ ఉంది.

నిన్నటికి నిన్న, పీటలమీద కూచున్నపుడు-పదోక్లాసులో చదువుచెప్పిన శాస్త్రి గార్ని పిల్చి, దణ్ణమైనా పెట్టకుండా ఏవన్నాడు! "మేస్టారూ! నేను పరీక్ష ఫెయిలైనప్పుడు, 'మేకలు కాసుకునీ ఎదవలకి సదువులెలాగబ్బుతాయిరా' అన్నారు కదా! బహుశా ఈ ఊళ్ళో మీదగ్గిర సదువుకున్నోళ్లలో మిమ్మల్నిలాగ పిల్చి

కొత్తబట్టలెట్టినోడు ఈమేకలు మేపుకునేవోడేననుకుంటాను" అన్నాడు.

సర్వీసులో వుండగా పొగరుమోతు అన్పించుకున్న శాస్త్రిమేస్టార్ని రిటైరయ్యేక ఎవరూ పట్టించుకోవడం మానేసారు. చివరికి కన్నబిడ్డలు కూడా.

ఆయన వెల వెల పోతూనే అయోద్దిరాముడిచ్చిన బట్టల్నీ, స్వయంపాకాన్ని అత్తారబత్తంగా సంచిలో కుక్కుకుని వెళ్ళేడు. వెనక నించి అయోద్దిరాముడు ఇదిగో ఇలాగే సంతప్తిగా నవ్వుకున్నాడు.

"సామాన్లన్నీ సర్దేసేవండి. మేకపోతులకి పసుపు రాసి ఏప మండలు కూడా కట్టేసేం. ఇంకేం జెయ్యాల?" అంటూ వచ్చేడో కుర్రాడు.

"ఒక పని చెయ్యండ్రా, మేకల్నెలాగా డప్పుల్తో నడిపించుకెళ్ళాల గాబట్టి ఈట్నిక్కడే వదిలేసి, వలీ సాయిబు కోళ్ళఫారానికెల్లి నేనిమ్మన్నానని వందకోళ్ళని వేన్లో వేసుకుని రాయిలమ్మ తల్లికాడికొచ్చెయ్యండి" అన్నాడు.

'అలాగే' అని కుర్రాడు వెళ్లబోతుంటే "ఆ... ఇదిగోరేయ్ అని వెనక్కి పిల్చి" ఈ చిన్న చిన్న కుర్రోళ్ళందరూ అంతదూరం ఏం నడవగల్రుగానీ, ఆళ్ళని ఆ వేన్‌లో ఎక్కించుకుని తీసుకుపొండి." అన్నాడు.

"ఒద్దొద్దు, మేం ఊరేగింపుతోనే వత్తాం" అని గెంతులు మొదలెట్టేరు పిల్లలు.

"పోన్లేరా తమ్ముడూ, ఆళ్ళు సోకుల్జేసుకున్నదే అందుకు. అలాగే రానియ్, కుర్రమంద, ఆళ్ళకి అలుపూ సొలుపేటి అంది అయోద్దిరాముడి రెండో అక్క గౌరమ్మ.

ముసలమ్మని చూసుకుంటూ తను ఇంట్లోనే ఉండిపోతానంది మూడో అక్క మూలేస్పరి, ఆవిడ చంటిబిడ్డ తల్లి.

అందరూ ఊరేగింపుగా బయలుదేరేరు.

ఎప్పుడు తయ్యారైపోయేరో తప్పెటగుళ్ళోళ్ళు.. తప్పెటగుళ్లతో పాడుకుంటూ ముందు నడక మొదలెట్టేరు. అనపర్తి అప్పారావు బృందం వెళ్లిపోతామంటే, భోజనాలు

చేస్తే గాని వెళ్ళొద్దని ఆపేసేదు అయోద్ది రాముడు. వాళ్ళూ ఊరేగింపులో కలిసేరు.

మాఘ మాసపు తెల్లారుఝాము చలంతా ఏమై పోయిందో అప్పటికే ఎండ తీవ్రంగా నిప్పులు చెరుగుతోంది.

ఊరికి నాలుగు కిలోమీటర్ల దూరంలో జటాద్రి కొండ పాదంలో మర్రి చెట్టు కింద ఉంది రాయిలమ్మ గుడి. గుడి అన్న పేరేగాని గుడి ఏమీ ఉండదక్కడ. గిరిజన ప్రాంతాలన్నిటిలాగే ఇక్కడా మర్రిచెట్టు మొదట్లో మూడు కొండరాళ్ళు అడ్డదిడ్డంగా పడివుంటాయి. వాటినే రాయిలమ్మ అనే గ్రామ దేవతగా పూజిస్తారిక్కడ. చుట్టూ పంట పొలాలున్నా, ఈ ప్రాంతానికి ఒంటరిగారారెవరూ.

ఆడవాళ్ళందరూ కుచ్చిళ్లు పైకి దోపి, పళ్ళెంలో కలిపి తెచ్చిన పసుపు ముద్దని రాళ్ళ పైన పూసి కుంకంతో బొట్లు పెట్టేరు. ఎవరో అంటించుకొచ్చిన ఒట్టిగడ్డి చిలప మీద గుగ్గిలం పొగ వేసేరు. చలిమిడి ముద్దలు, అరటిపళ్లముక్కలు రాళ్లనిండా అంటించేరు.

"ఆడంగులు బేగా తెవలకపోతే సేనా కష్టవండి అయోద్దిగారూ" అన్నాడు మేదర జంగయ్య.

"అయిపోయిందయిపోయింది" అంటూ ఒక్కొక్కళ్లూ రాయికి మెత్తిన కుంకాన్ని,పసుపునీ తీసి నుదుటికి పూసుకుని, దణ్ణం పెట్టుకుని పక్కనున్న మడిచెక్క గట్లకేసి నడిచేరు. శ్రీలక్షమ్మ మాత్రం దూరం నుంచే చేతులు జోడించి వెనక్కొచ్చింది. వితంతువులు అమ్మవారి రాళ్ళమీది పసుపు కుంకాల్ని ముట్టుకునే సాహసం చేయరక్కడ.

బాల్యంలో చెల్లెళ్లని వెంటేసుకుని ముక్కనుమ పండగ రోజుచలిమిడి,వడపప్పు పట్టుకుని ఇక్కడికి రావడం గుర్తుకొచ్చింది శ్రీలక్షమ్మకి. "రాయిలమ్మగుడి అంటారు గుడెక్కడుందే మామ్మా" అనడిగితే 'ఆ రాళ్లకింద నేల లోపలుంది' అన్చెప్పేది మూలమ్మ మామ్మ.

ఆ రాళ్ల సందుల్లోంచి నేల లోపలున్న గుడి గోపుర శిఖరం కనబడుతుందేమో

నని రాళ్ల మధ్యలో మొహం పెట్టి తెగ వెతికేది శ్రీలక్ష్మమ్మ. మర్రి చెట్టు వేళ్లు, వేళ్ళమీద రాళ్ళు తప్ప ఇంకేమీ కనపడేది కాదు. ఒకసారలా వెతుకుతుండగా రాళ్లకింద రెండు మూడు పాము పిల్లలు పాకుతూ కనపడ్డాయి అంతే, హడిలిపోయి వెనక్కి పరుగెత్తుకొచ్చింది.

“మామ్మా, ఎంత చూసినా గుడి కనపట్టం లేదే” అంటే “ ఆ గుడి అందరికీ అంపడదే, ఇదుప్పుడు మాట కాదు, ఎంత కాలవైందో తెల్దు, మనూరి పెద్దరాజుగారులేరూ, ఆరి ముత్తాతగారి ముత్తాత అడివిదారంట ఎక్కడికో నడిసెల్తా ఆ సెట్టుకింది రాళ్ల మీద తలెట్టుకుని పడుకున్నాడంట. ఎంతకీ నిద్దరట్టక ఇసారించి సూస్తే ఇక్కడీ తల్లుందని గెమనంకొచ్చిందంట. ఎంటనే అపసారం, అపసారమని సెంపలేసుకుని లేసిపోయేడంట. ఇంటికెల్లి ఆరి బలగాన్నంతా ఎంటెట్టుకుని సామానంతా బండి మీదేసుకుని దగ్గిర్లో ఉన్న ఈ ఊరొచ్చేసేరంట.ఆ తల్లి ఎండకి ఎండి వానకి తడ్డం సూళ్ళేక గుడి కట్టించాలనుకున్నారంట.

“ఎంటనే ఆ తల్లి ఆరికి కల్లో కనపడి‘నాకు గుడీ ఒద్దు గోపురమూ వొద్దు, బూవి లోపల నాకు గుడున్నాది, నా మాటినకుండా ఎవళ్లైనా గుడి కట్టాలని పెయత్నం సేత్తే ఆళ్లకళ్లు పెటీమని పేలిపోతాయని సెప్పిందంట”

“అప్పుడిక్కడ సీవలు దూరని సిట్టడివి కాకులు దూరని కారడివి లాగుండీదంట, ఆరే, ఊరికాణ్ణుంచి అక్కడిదాకా సెట్టూసేవా కొట్టించి బండిబాటేయించి, ఈ సుట్టుపక్కల అడివంతా నరికించి పంటపొలాలకింద మార్చేరంట.అప్పుడు కాణ్ణుంచి ఈ బూవులన్నీ ఆరియ్యే. అప్పుడుకాణ్ణుంచీ ఆ తల్లే ఈవూరికి గ్రేమ దేవత.” అదిగందుకేఆతల్లికిగుడికట్టించటానికెవళూ ముందుకిరాలేదింక” అని కథ చెప్పుకొచ్చింది.

పక్కనున్న జటాద్రికొండవేపు చూసింది శ్రీలక్ష్మమ్మ. కొండకొండ అంటారేగాని అదిపెద్దకొండేమీ కాదు.

చిన్నప్పుడు మేకలవెంట చాలాసార్లు ఎక్కిదిగింది తను.ఆ గుట్టమీది

కొండరాజుల చింతచెట్టు బుట్టలకొద్దీ కాయలు రాల్చేది.

పచ్చికాయల దగ్గర్నుంచి పండుబుట్టల్దాకా పిల్లలందరూ ఒడినింపుకొచ్చేవారు. రాలినకాయలు, పుల్లలు ఏరుకోవాల్సిందేగానీ చెట్టుమీద ఎవరూ చెయ్యి వెయ్య కూడదనేవారు.

ఒక్క రాజుల పండక్కి మాత్రం ఆడపిల్లల్ని ఆ కొండమీదికి రానిచ్చేవారు కాదు.

కోతలకి ముందు పనలు నలిపిన పచ్చి బియ్యంతో ఉప్పుబెల్లం లేని చప్పటి పరవాన్నం వండి, ఆచింత చెట్టుకింద కొండరాజులపండగ చేసేవారు. అక్కడేం జరుగుతుందో తెలుసుకోవాలని ఎంతో కుతూహలంగా ఉండేది ఆడపిల్లలకి. అది కూడా మామ్మే విడమర్చి చెప్పింది.

అయిదేళ్ళనించి పదేళ్ళలోపు మగపిల్లలైదుగుర్ని పాండవరాజులుగా ఎంపికచేసి, పొద్దున్నే వాళ్లచేత తలారా స్నానం చేయిస్తారట. చెట్టుకింద మూడురాళ్లపొయ్యి పెట్టి కొత్తకుండలో నీళ్లుకలపని మేకపాలు, పచ్చి బియ్యంవేసి మొగోళ్లు మాత్రమే పరవాన్నం వండుతారట. ఆ అయిదుగురు పాండవరాజుల్ని బట్టల్లేకుండా కూర్చోబెట్టి జిల్లేడాకుల్లో పరవాన్నాన్ని నైవేద్యం పెట్టి, మిగిలింది అందరూ పంచుకు తింటారంట. కొత్తకుండనక్కడే వదిలేసి, వెనక్కి తిరిగి చూడకుండా వచ్చేస్తారంట.

తీపిలేని మేకపాల పరవాన్నాన్ని ఎలా తింటారోనని'యాక్ యాక్' అనుకునేవారు ఆడపిల్లలంతా.

"ఆడోళ్లుగా పుట్టి బతికిపోయేం" అనేది గుంటుబోయినోళ్ల కిష్టమ్మ.

అయోధ్దిరాముణ్ని రాజుల పండక్కి మూడేళ్లు తీసుకెళ్ళేరు. తిరిగొచ్చేక పేటలోని ఆడపిల్లలందరూ ఆట పట్టించి ఏడిపిస్తూంటే సిగ్గుతో ఇంట్లోదూరి, రెండు మూడురోజులు బైటికొచ్చేవాడేకాదు.

జనంలో ఆ నమ్మకాలు పద్ధతులు క్రమంగా అడుగంటుతున్న చిహ్నంగా చింతచెట్టుకొమ్మల్ని ఎవరో నరికేసారు. జటాద్రికొండ సుద్దకొండని తెలిసిందట.

దగ్గర్లో వెలిసిన సిరమిక్స్ ఫ్యాక్టరీల కోసం కొండను తవ్విపోస్తున్నారు.

తర్వాతి తరాలవాళ్లకి ఇక్కడొక కొండ ఉండేదని తెలీనే తెలీదు కాబోలు-

మేకపోతులు గొంతు తెగిపోయేలా అరుస్తూంటే అటు చూసింది శ్రీలక్ష్మ్మ.

మేదరజంగయ్య చేతిలో కత్తి చూడగానే వాటికి అర్థమైపోయింది తమనేం చెయ్యబోతున్నాడో. వాటి కళ్లలోని భీతిని చూడలేక తలతిప్పుకుంది శ్రీలక్ష్మ్మ.

మేకపోతుల పీకలు తెగిపడ్డాయి.

రక్తంలో పడికొట్టుకుంటున్న వాటి దేహాల్నీ తలల్నీ చూడలేక కొబ్బరిచెక్కలు ఏరుకుంటున్న పిల్లలు భయంతో ఆడవాళ్ల దగ్గరకి పరుగెత్తుకొచ్చేసేరు.

పీకలు కోసిన కోళ్లనీ, మేకల్నీ వేన్‌లో పడేసి రైట్ రైట్ అంటున్నాడు క్లీనరుకుర్రోడు.

కాళ్లు నొప్పెడుతున్నా, వాటినిచూసి ఈసారి అసలెక్కమన్నారు పిల్లలు. ఇంక నడవలేని ముసలోళ్లు నలుగురైదుగురు వేనెక్కేసేరు. జంగయ్య, ఈర్రాజు పైమీది పంచెల్ని పరిచి కోళ్లతలకాయల్ని ఏరుకుంటున్నారు.

కొబ్బరిచెక్కల్ని రాతిమీద చితక్కొట్టి అందరికీ ప్రసాదం పంచింది పార్వతి.

వెళ్లిన వాళ్లందరూ ఇంటికిచేరేసరికి గుండిగలనిండా బూరెలు, గారెలు వండిపోసున్నాయి. మరోపక్క గాడిపొయ్యిమీద పలావు తయారైపోయినట్టుంది వాసన గుమ్మెత్తుతోంది. పైన మూతమీద పోసిన నిప్పులు పలావులో పడకుండా మూతని మాత్రం జాగ్రత్తగా కదిలించి ఉడికిందోలేదో చూస్తున్నాడు సుబ్బులు.

"ఎంతదృష్టం అక్కా నీది! మా ఇళ్లల్లో ఏ అక్కరొచ్చినా రెక్కలు ముక్కలయ్యాలాగ, నడుములు పడిపోయిలాగ ఆడోళ్లం వొండుకోవలిసిందే ఎంతెంతవొంటలైనా. బావలాగ వొంటోళ్లచేత వొండించడవనీ మాటేలేదు" అంది మంగ రత్నంతో.

రత్నం కొంచెం గర్వంగా నవ్వీ నవ్వనట్టు నవ్వింది.

అయోద్ధిరాముడి మామగారు లోవరాజు పర్యవేక్షణలో మాంసంకోత పూర్తికావచ్చింది.

మసాలా కలిపిన కోడిమాంసాన్ని పొయ్యిమీదికెక్కించేసేరప్పుడే.

"మేకమాంసం అసలే బేగా ఉడకదు. ముదిరిన పోతులయ్యె. ఇంతసేపు కోత్తే ఎలాగ?" అని కంగారు పెడుతున్నారు వంటవాళ్లు. రెండు మేకపోతుల పేగులసంచుల్ని రెండు చేతుల్తో పట్టుకుని "అచ్చమ్మొలేయ్! ఈ బోటీ సుబ్రంచేసి సింతసిగురేసి ఒండే, మంచి కొవ్వట్టిన బోటీ బలేగుంటదిలే" అంటుంటేనే లోవరాజు నోట్లో నీళ్ళూరుకొచ్చేయి.

"ఆ-నీలాటిదే,నీళ్లోసుకున్నానమ్మా నిబ్బరంగా నడండందరూ అన్నాదంట. ఈ అడావిడిలో నీకు బోటీ ఒండెట్టాలా? ఈ బోటీకడిగీతలికి సేతులడిపోతాయి బాబా, అయినా ఉప్పుడు సింతసిగురెక్కణ్నుంచి తెమ్మంటావ్" అంది లోవరాజు పెళ్లాం అచ్చమ్మ రుసరుసలాడుతూ.

"పోనీ సింతసిగురుదొరకదంటే కొత్తసింతపండేసి పులుసెట్టు" అన్నాడు లొట్టలేసుకుంటూ. "తలకాయ మాంసం కాల్చేసి ముక్కలు కొట్టి ఉంచుతాను, అది రేపు పులుసెట్టుకుందారి."

"సందట్లో సడేమియా అని ఈయబ్బి తిండికి ఏళాపాళా లేదమ్మా" అని సణుక్కుంటూ లేచెళ్లింది అచ్చమ్మ.

ఎప్పుడు బిగించేరో మైకుసెట్టు- ఉన్నట్టుండి 'యమహానగారీ-కలకత్తా పూరీ' అంటూ తెలుగురాని గాయకుని పాటొకటి మొదలైంది.

పేటలోని పిల్లలంతా క్షణాల్లో అక్కడ చేరిపోయేరు.

కొందరు గేట్లుపుచ్చుకుని వేళ్లాడుతుంటే ఇంకొందరు గోడలమీదెక్కి చోద్యం చూడ్డం మొదలెట్టేరు.

"అదేం పాట్రొరే, మంచి యన్టీవోడి పాటుంటే ఎయ్యొహే" అనరిచేడు

లోవరాజు. "ఇదేటి ఈ కుర్రమందంతా ఇలాగొచ్చి పడిపోయేరు. ఈళ్లేం మిల్లులకెల్టం మానేసేరేటి?" అన్నాడు.

"మీకింకాతెల్దేటండి, కుర్రోళ్లని పనుల్లో ఎట్టుకోకుండా సట్టం వచ్చింది గదండీ, ఆపీసర్లు సెకింగుకొచ్చినప్పుడల్లా ఈళ్లకి పన్లుండవండి" అన్నాడు కత్తిపీట ముందేసుకుని ఉల్లిపాయలు తరుగుతున్న వంట అసిస్టెంటు మునియ్య. ఉల్లిపాయలఘాటుకి అతనికళ్లుఎర్రబడినీళ్లుకారుతున్నాయి. పైమీది మురికిపట్టిన తువాలుతో మాటిమాటికీ కళ్లు తుడుచుకుంటున్నాడు.

"అవునియ్యేంసట్టాలోరే, ఎదిగేవోణ్ణి ఎనక్కిలాగే సట్టాలు. పోనీ, ఎదిగేవోడిమాటొద్దు, కూటికిలేనోళ్లమాటే సెప్పుకుందారి,లా మొల్లి సెక్రయ్యకి ఏనమండుగురు సంతానం. ఆ మద్దిల పొడపాము కరిసి ఆడికాలు సగం తీసేసేరు. కుర్రోళ్లందరూ పన్లోకెల్లి తలోపదీ అట్టుకొత్తే ఇల్లు గడిసిపోయాది. ఉప్పుడందులో అయిదుగురు కుర్రోళ్లకి పన్జేసేవాయసురాలేదని తీసేసేరంట. కరువు మండిపోతున్న ఈరోజుల్లో తల్లి పదిమందీ ఏటి తింటార్రా?" అన్నాడు సప్పాసిట్టబ్బులు. అతను లారీ బ్రోకరు. ఫేక్టరీలొచ్చేక ఊళ్ళో చాలా మంది లారీలు కొన్నారు. మిల్లులకి కావలిసిన ముడిసరుకు మట్టి, ఊక లాంటివి సరఫరా చెయ్యడానికి, తయారైన పెంకు రవాణాచెయ్యడానికి లారీలు అవసరం కాబట్టి మిల్లులు పెట్టినవాళ్లతోబాటు లారీలు కొన్నవాళ్లూ, వేయింగుబ్రిడ్జిలు పెట్టినవాళ్లూ సునాయాసంగా ఎదిగేరు.

"అంతమందిని కనటవెందుకు? తిండిలేదని ఏడ్డవెందుకు? అది సరేగానొరే సిట్టబ్బులూ, సంపాదన బాగానే ఉందంటకదా, ఏ మాత్రం ఎనకేసేవేట్రా?" అన్నాడు లోవరాజు.

బాణలిలో ఉల్లిపాయల్ని పెద్ద చట్రంతో వేయిస్తున్న సుబ్బులు పళ్లికిలించి నవ్వేడామాటకి. " సిన్నబ్బులుగారేంఎనకేత్తాడండి,ఆరిరోజు సంపాదనంతా రేత్రికి ఆరికక్కాముక్కలకీ, గళాసులకీ కర్సైపోద్దండి" అన్నాడు.

"నువ్ నోర్ముయ్యెహె లంజకొడక" అన్నాడు సిన్నబ్బులు." అది కాదు లోవరాజు

మావా, నా మాటొదిలేయ్,నేను కర్సు మనిసినే, నా జేబులో డబ్బులు నిలవుండవు సరే, అలాగని అప్పులూ లేవుగదా! ఈ వూళ్లో ఇయాల్టికియాళ లెక్కెడితే అరవైమిల్లులు లెక్కతేల్తాయి నీకు. తలకాయలు రిక్కించుకుని నిటాగ్గా నిలబడ్డ మిల్లుల గొట్టాలొక్కటే కనపడతన్నాయి పైకి. ఎనకటికి మా బాబనీవోడు, 'ఒరే సిన్నబ్బులూ, ఏ దేశంవోడన్నా మన్తో యుద్ధం సెయ్యాలనుకుని ఇమానంలో అలాగ సూసుకుంటావత్తే మొట్టమొదటి బాంబు మనూరిమీదే ఏసేత్తాడ్రా!' అని:

అక్కడికేటీ ఈపెంకుల మిల్లులు, ఈసిరామిక్సుమిల్లులు, ఈ సగ్గుబియ్యం పేక్ట్రీలు అన్నీ మనూరి సుట్టూతానే గదా వున్నాయి. ఇందాకేటీ సెప్తున్నానూ... అదే...తాతలూ బాబులూ సంపాదించి మూటలిచ్చిపోయినోళ్లనొదిలేత్తే ఇయ్యాళ ఒక్కొక్కళ్లకీ బేంకుల్లో ఎంతెంత పింగులున్నాయో నన్నడుగు సెప్తాను."

"ఏటియ్యాళ సిన్నబ్బులుగారు మద్దేనానికే మందుమీదున్నారేటి?" అన్నాడు సుబ్బులు.

"ఒరేయ్, నువ్వు నోర్మూత్తావా సెప్పుతీసుక్కొట్టేయనా! ఆడితో ఏట్లే, నువ్వినుమావా, ఇది వరకంతా ఏటి, లారీ కర్సెట్టుకుంటే సాలు, మట్టి ఊక అన్నీ ఉత్తినే వచ్చియ్యి. ఇయ్యాళ లారీ మట్టి ఆరొందలు. ఊక పన్నిండొందలు. మరి కరెంటో? కూలోళ్లు నాల్రూపాయలిత్తే పెద్దోళ్లు రెడీ, రెండ్రూపాయలిత్తే సిన్నోళ్లు రెడీ. ఇయ్యాళ నలభైరూపాయలిత్తే గానీ కూలోడు పన్లోకి రాడు, పోనీ పదిహేను రూపాయలేగందాఅనికుర్రోళ్లనెట్టుకుందావంటే ఆళ్లసేత పని సేయించకూడదని సట్టం. ఈ మద్దిలో ఎవడి సెయ్యన్నా ఏప్రెస్సింగు మిసన్లోనన్నా అడిపోయిందంటే యూనియను మొత్తం ఒకటై నిలబడిపోయి కాంపన్సేసను పిండేత్తాది. ఇంకేటి మిగుల్తాది మట్టి!"

"ఇంతకీ నువ్వు మిల్లు ఓనర్ల గురించి ఇసారిస్తన్నావా, కూలోళ్లగురించి ఇసారిస్తన్నావా? నాకేవీ అర్థం అవటం లేదు" అన్నాడు లోవరాజు.

"ఆరు కూలోళ్లగురించి ఎందుకిసారిత్తారండి, ఓనర్లగురించే ఇసారిత్తారు.

అళ్లు బాగుంటేనేగదా ఈరికి ముక్కాడీది"- సుబ్బులు.

జేబులోంచి క్వార్టరు బోటిలుతీసి గడగడా రెండుగుక్కలు తాగి మూతబిగించి లాల్చీపక్కజేబులో పడేసుకుని కాండ్రించి ఉమ్మేసాడు సిన్నబ్బులు.

"అసలీ ఊరుగురించే ఇసారిస్తన్నాను. ఈ కనపడతన్న ఎర్రెర్రని మిల్లులన్నీ ఏటనుకున్నావు, ఒకప్పుడు పచ్చని పంటసేలు, మావిడితోటలు, కొబ్బరితోటలు, బత్తాయితోటలు, ఒకటేటి ఇక్కడ పండనిదేదైనా ఉండీదా? ఇటు దచ్చినానికెళ్తే ముప్పైమైళ్లలో సముద్రం, అటు పడవటికెళ్తే ముప్పైమైళ్లలో గోదారమ్మ, బోరుకొట్టిత్తే ఏనుగుతొండవంత దార నీళ్లు. అలాటి బూలచ్చివమ్మమీద పేక్టరీలు కట్టి లంకంతేసి బట్టీలెట్టేరు. రోజూ ఆబట్టీలన్నీ అంటుకుని మండుతుంటే ఏడాది పన్నిండు నెల్లూ ఏసంకాలవే ఇక్కడ. మనుసులివే సీవల్లాగ మాడిపోతన్నావే, సెట్టూసేవా బతకమంటే ఏం బతుకుతాయి? అందుకే ఈ ఊరు సూత్తేనేమో కాలి సల్లారిపోయిన ఊర్లాగ కనపడతంది. ఊరిసుట్టూ ఉండోల్సిన నాలుగుసెరువుల్లో ఒక్క సెరువుందేమో సూపించియ్యాళ"

"అలాగనకొరే, ఈ పేక్టరీలు ఎందరికి కూడెట్టటంలేదు! ఎక్కడెక్కణ్నుంచో జనాలొచ్చి ఈ ఊరింత పెరిగిందంటే కారణం ఈ మిల్లులేగందా"

"అయితే పంటచేలోపని పని కాదంటావు, మిల్లుల్లో పనే పనంటావ్"

"చేలల్లో పని ఏటికేడాదీ ఎక్కడుంటాదిరా, వారం వొచ్చీతలికి రెండువందల నలభైరూపాయిలు జీతంరాళ్లు చేతిలో పడ్డంలేదూ కూలోడికి! ఎవరి మాటో ఎందుకు, నువ్వియాళ ఇలాగ తెల్లబట్టలేస్కోని, కరీదైన మందుసీసా జేబులో ఎట్టుకోని తిరుగుతున్నావంటే కారణం మిల్లులేనాకాదా? మా అయోద్దిరాముడింతిల్లు కట్టేడంటే, ఇయాళ ఈస్తితిలో ఉన్నాడంటే కారణం ఏటంటావు?"

సిన్నబ్బులు కళ్లెత్తి కొత్తింటిని రెండునిమిషాలు రెప్పలార్పకుండా చూసేడు. ఉన్నట్టుండి విరాగిలా నర్మగర్భమైన నవ్వొకటి నవ్వేసి అక్కణ్ణుంచి లేచిపోయేడు.

కోడిప్రై ఉన్న బాణలి దగ్గరకెళ్లి వేగిన ముక్కొకటి తీసుకుని ఊదుకుంటూ

గేటువైపు వెళ్తున్నాడు.

"ఒరే సిన్నబ్బులూ, అయిపోవచ్చింది, ఏకంగా తిండి తినెల్లరాదూ" అనరిచేడు వెనకనించి లోవరాజు.

"పనున్నాది, మళ్లొత్తాను" అన్నాడు సిన్నబ్బులు.

"తాగాపోతే ఒక్కమాట మాట్లాడ్రండి సిన్నబ్బులుగారు. తాగితే మాత్రం ఆర్నట్టుకోలేవండి. కానీబాబూ ఆరిమాటల్లో సేనా నిజవుందండి. యాపారమెళకువలు తెలీక మిల్లులెట్టిన పెద్దరైతులెందరో దెబ్బతినేసేరండి. 'ఏవున్నాది, రెండులచ్చలు సేత్తో అట్టుకుంటే బేంకు పదిలచ్చలిస్తందిగదా అని దిగిపోయేరండి. వడ్డీలేగాని అసలు కట్టలేక సేనామంది సతకలబడిపోతన్నారండి. అసలిప్పుడు పెంకుటిళ్లెవరు కడతన్నారండి? లేనోడికెలాగాలేదు పూరింట్లోనే ఉంటాడు, కట్టుకోగలిగినోడు మరో పదేలు అప్పు చేసైనా డాబాయేసేస్తన్నాడండి,వాసాలు పుచ్చిపోడం, పెంకు తీసిపెంకెయ్యడం లాంటి తంటాలుండవని. ఉప్పుడికే మిల్లులు ఒకరోజు పంజేత్తే వారంరోజులు తొంగుటన్నాయండి. మిల్లులు తొంగుంటే కూలోడికి కూడెక్కణ్నుంచొత్తాదండి' " అన్నాడు సుబ్బులు.

"సుబ్బులన్నా నువ్వు సెప్పిందెంతసేపూ ఓనరుసైడు నించే ఉన్నాది. అదిగలాగ ఊళ్లోకిసూడు. ఆ పెద్దమేడలు, ఆళ్లు తిరుగుతున్నకార్లు, ఆరిళ్లల్లోని ఎండీబంగారాలు ఇయ్యన్నీమిల్లులమీదగడించినయ్యికావంటవా? ఆళ్ళంతెదగటానికి కారణవైన కూలోడెంతెదిగేడో సెప్పు. ఆళ్ల ఇళ్లకి ఏసీలు, కార్లకి ఏసీలు, మిల్లుల్లో ఆళ్లుకూకునీ ఆపీసుగదులు ఏసీలు. ఇంక పెనం మీద పేలాపగింజలాగ కూలోడెలాగేగిపోతే ఆళ్లకేంగావాల. సీజను కాకపోతే పనాపేత్తారు. తయారైన సరుకు అమ్ముకోలేక పనాపేత్తారు. అన్నాళ్ళూ కూలోడి పొయ్యిలో పిల్లులు తొంగోవలిసిందే." అన్నాడు మునియ్య. ఆవేశంతో అతని కళ్లు మరింత ఎర్రబడిపోయేయి.

"ఈడు మొన్నటిదాకా బట్టీమేస్త్రీగా చేసేడండి. పన్లేదని తీసేసేరు. అదీ ఈడి గోల." అన్నాడు సుబ్బులు మళ్లీ పళ్లికిలిస్తూ.

వంటవాళ్లకి కావాల్సిన సంబారాలందిస్తూన్న శ్రీలక్ష్మమ్మ చెవిన ఈ సంభాషణంతా పడుతూనే ఉంది.

ఆమె మనసెందుకో భారంగా తయారైంది.

వంటలు పూర్తయ్యాయి.

వంటింట్లో ఉత్తరం మూలగోడకి అరచెయ్యంత పసుపురాసి కుంకుమబొట్లు పెట్టేరు. వండిన పదార్థాలన్నీ పెద్దపళ్లెంలో నింపి తెచ్చి అక్కడపెట్టి కొత్త ప్రమిదతో దీపం వెలిగించింది రత్నం.

పన్నెండు గంటలకంతా భోజనాలు ప్రారంభమయ్యేయి.

తినరనుకున్న వాళ్లంతా గరిటెలు గరిటెల మాంసాన్ని సునాయాసంగా తినేస్తుంటే, నోళ్లుతెరుచుకుని చూస్తూండిపోయేరు అయోధ్దిరాముడి చుట్టాలు.

"ఈళ్లిలాగ రుసిమరిగేకే మన నీసుకూరలరేట్లు అలాగ పెరిగిపోయేయి." అన్నాడు లోవరాజు ఇంట్లోకొచ్చి ఆడోళ్లతో.

భోజనం అయ్యాక గుప్తగార్ని వెంటబెట్టుకుని ఇల్లు చూపించేడు అయోధ్దిరాముడు.

ఇల్లు చూస్తున్న గుప్తగారి కళ్లల్లో-పొద్దున్న అలంకరించుకున్న రత్నాన్ని చూసినప్పుడు మంగకళ్లల్లో కన్పించిన ఈర్ష్య కన్పించినట్టైంది శ్రీలక్ష్మమ్మకి.

అది నిజమో భ్రమో తేల్చుకోలేకపోయింది.

భ్రమ కాదు నిజమేనని అర్థమయ్యేసరికి ఏడాది గడిచిపోయింది.

ఏమున్నా లేకపోయినా సంకురాత్రికి ఆడపడుచుల్ని పిలిచి కలిగిందేదో పెట్టి పంపించడం కులాచారం. క్రితం సంవత్సరం పండక్కి, గృహప్రవేశానికి కలిపి పట్టుచీరలు పెట్టిన తోడబుట్టినవాడు ఈ సంవత్సరం జాకెట్టుముక్కల్తోనే ఎందుకు సరిపెట్టేడో ఆ ఇంటి ఆడపడుచులెవరికీ అర్థం కాని పరిస్థితి.

ఆర్థికసంబంధాలేవీ ఆడవాళ్లకి సంబంధించినవి కావు అనే గొప్ప నమ్మకం

చాలామంది మగవాళ్లలాగే అయోద్ది రాముడికీ ఉండడం వలన ఆ ఇంట్లో ఆడవాళ్లెవరికీ ముందుగా ఏవిషయమూ తెలీలేదు. ఏంజరిగిందో ఎలాజరిగిందో అర్థమయ్యేలోపలే అయోద్దిరాముడి ఫేక్టరీ చేజారిపోయింది.

బేంకు ఫేక్టరీకి తాళాలువేసి సీళ్లేసేసింది.

గుప్తగారి అప్పువడ్డీలపైన వడ్డీలు పెరిగి ఇంటిని మింగేసింది. ఫర్నిచరుతో సహా ఇల్లు పరాయిదైపోయింది.

ఆవిషయం తెలుసుకున్న ముసలమ్మ మంచంలోనే ప్రాణం వదిలేసింది.

"బంగారాన్ని మట్టిసేసేసేవురా అయోద్దిరాముడూ" అన్నాడు పెద్దగొల్లతాత.

"నిలబడి నీళ్లుతాగకుండా పరుగెట్టి పాలుతాగాలనుకున్నాడు, ఉప్పుడేవైంది!" అన్నారు కులపోళ్లు నలుగురూ.

తప్పు చేసినవాడిలాగా తలదించుకుని కూర్చుంటున్న అయోద్దిరాముడికి 'ఇది నీలోపంకాదు, వ్యవస్థలోపం. నిన్నాదుకోగల కులం బలంగాని, ఆర్థిక బలం కాని నీవెనకలేకే ఇలా జరిగింది' అని చెప్పేవాళ్లు లేకపోయేరు.

శ్రీలక్షమ్మ అత్తవారిది దూరంగా కొండలవెనక కుగ్రామం.

అక్కడావిడకి ఒకచుట్టుగుడిసె, ఎకరం మడిచెక్క ఉన్నాయి. ఆవిడ మరిది దాన్ని దున్ని పండిస్తున్నాడు. ఏడాదికోసారెళ్లి ఫలసాయం తెచ్చుకోవడం అలవాటు.

గుప్తగారు చాలా మంచివారు. అయోద్దిరాముణ్ని వచ్చి తన మిల్లులో గుమస్తాగా ఉండమని మళ్లీ పిలిచేరు. నిరాటంకంగా నడుస్తూన్న మిల్లుల్లో గుప్తగారిదొకటి. ఆయనకి తరాలుకూర్చుని తిన్నా తరగనంత తాత తండ్రుల ఆస్తి ఉంది. ఆయనలెక్కకే అందనన్ని వ్యాపారాలున్నై. సరీగ్గా నడవకపోతే పెంకుల మిల్లుని పేరడైజ్ హోటల్గా మార్చగల సత్తా ఉంది.

కాని అయోద్దిరాముడే పువ్వులమ్మినచోట కట్టెలమ్మలేక అక్కగారివెంట ఆమారుమూల పల్లెకొచ్చేడు.

శ్రీలక్ష్మమ్మ తోడికోడలు గుడిసెను శుభ్రంగా అలికి ముగ్గులేసి ఉంచింది. రోజూ పేడకళ్లాపు వెయ్యడం వలన దడిలోపల వాకిలి గచ్చులా శుభ్రంగా ఉంది.

వాకిట్లో ఉన్న వేపచెట్టు పూతమీదుందేమో గాలి కమ్మని పరిమళాన్ని వెదజల్లుతోంది.

చెట్టుకిందున్న పొయ్యిమీద అన్నం వండుతోంది శ్రీలక్ష్మమ్మ.

పైకి తేలడంలేదుగాని అయోధ్ధిరాముడి మనసు పొయ్యిమీద ఉడుకుతున్న అన్నంలా కుతకుతా ఉడుకుతూందని తెలుసు శ్రీలక్ష్మమ్మకి.

తనకి తమ్ముడైనా కొడుకైనా వాడేకదా, ఇంకెవరున్నారు? ఇక్కడైనా వాడు శాంతిగా బతికితే చాలు.

పక్కవాకిట్లో కట్టేసి ఉన్న మేక పిల్లతో ఆడుకుంటున్నారు పిల్లలు.

హఠాత్తుగా లోపల్నుంచి రత్నం మాటలు వినపడ్డాయి.

"పట్టపగలే కీచురాళ్లు రొదపెడుతున్న ఈమారుమూల ఊళ్లో నన్నూ పిల్లల్నీ ఏం చెయ్యాలని తీసుకొచ్చినట్టు? నువ్వెప్పుడూ అంటుంటావే లైపులైఫని, ఆలైఫ్ ఇక్కడ దొరుకుతాదనా నీ ఉద్దేశం?"

"......"

" ఇంకా నయం, వంటసామాన్లు పట్టుకుని వచ్చేసేం కాదు, పద, మాపెద్దమ్మ కొడుకు దగ్గిరికి పట్నం పోదాం. అక్కడేదో ఒకపని దొరక్కపోదు బతకటానికి"

"పట్నం అంటే నెలకెంతకావాలో తెల్సా"

"ఎంతైనా సరిపెట్టుకుందాం. కావాలంటే పస్తులుండమన్నా ఉంటానుకానీ ఇక్కడుండటం నావల్లకాదు."

మర్నాడు బయలుదేరుతున్న తమ్ముణ్ని, మరదల్ని ఆపడానికి ప్రయత్నించలేదు శ్రీలక్ష్మమ్మ. వాళ్ల భవిష్యతుని వెతుక్కుంటూ వాళ్లు వెళ్తామంటూంటే వద్దనడం తనకి భావ్యం కాదనుకుంది. చెట్టుమీంచి కిందపడిన పక్షి ఎగరడం స్వయంగా నేర్చుకోవాలి

కదా! వాళ్లెక్కిన బస్సు కదిలే వరకూ నిలబడి వెనక్కి తిరిగింది శ్రీలక్ష్మమ్మ.

చైత్రమాసపు గాలి అడవి గుబురుల్లోంచి చల్లదనాన్ని మోసుకొస్తోంది. మావిడిచెట్ల తోపులోంచి కోయిలొకటి గొంతు సవరించుకుంటోంది. ఎప్పుడు కట్టుతెంచుకుందో వాకిట్లో గెంతులేస్తోంది మేకపిల్ల. దాన్ని తీసి అపురూపంగా గుండెకి హత్తుకుంది శ్రీలక్ష్మమ్మ.

ఇక మీద అదేకదా తనకి తోడు!

కుడికంటి కొలుకులో నిలిచిన నీటిచుక్క నెమ్మదిగా చెంపమీదికి జారింది శ్రీలక్ష్మమ్మకి.

*********

**అమెరికా భారతి (నవంబర్ - డిసెంబర్ 99)**
**(ATA - కథల పోటీ మొదటి బహుమతి)**